క్లుప్తంగా

కూలీలకు వేతనాలు సక్రమంగా అందించాలి

దుగ్గిరాల: ఉపాధి హామీ కూలీలకు వేతనాలు సక్రమంగా అందించాలని సీపీఎం కార్మిక నాయకులు జెట్టి బాల రాజు డిమాండ్ చేశారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో పని జరుగుతున్న కార్మికుల వద్దకు మంగళవారం వెళ్లి వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనుల వేతనాలు సక్రమంగా అందడం లేదని.. పని కూడా రెండు, మూడు వారాలు కూడా ఉండడం లేదని ఆయన అన్నారు. కార్యక్రమంలో గోపి ప్రసాద్, ఆంజనేయులు, సుశీల, హైమావతి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభతోనే ఉన్నత స్థానం సాధ్యం



ఫిరంగిపురం: ప్రతిభాపాటవంతోనే ఉన్నత స్థానం సాధ్యమవుతుందని సెయింట్‌ఆన్స్ సెంటినరీ ఇంగ్లిషు పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలామేరి అన్నారు. ఈనెల 9న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ చేతుల మీదుగా షైనింగ్‌స్టార్స్–2025 అవార్డులు అందుకున్న పాఠశాల విద్యార్థులు డి.శ్రీభార్గవ్, ఎ.షణ్ముఖరాజప్రియలకు మంగళవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువాతో సత్కరించి అభినందించారు. మరెన్నో అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్మకాండల సత్రం నిర్మాణానికి సహాయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం పుష్కర ఘాట్ వద్ద కర్మకాండల సత్రం నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ సొంత నిధులతో మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. లోకేష్ తన సొంత నిధులు రూ.8 లక్షలు వెచ్చించి కర్మకాండల సత్రం నిర్మాణం చేపట్టారని అన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాల బాలికలకు వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ శిరోమణి మాట్లాడుతూ.. నేటికీ పలు ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతుండడం విచారకరమని అన్నారు. బాల్య వివాహాలు జరిగితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల మహిళల్లో అనేక సమస్యలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అధికారి చిన్ని కోటేశ్వరరావు, పెనుమాక మహిళా పోలీస్ అరుణిమ, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు సరళకుమారి, కిరణ్మయి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులతో చర్చించిన సమన్వయకర్త దొంతిరెడ్డి



మంగళగిరి కోర్టు వద్ద న్యాయవాదులతో చర్చిస్తున్న దొంతిరెడ్డి

తాడేపల్లి రూరల్: ప్రముఖ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును మంగళవారం కోర్టుకు హాజరుపరచడంతో ఆయనకు సంఘీభావం తెలియజేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళగిరి కోర్టు వద్దకు భారీగా చేరుకున్నారు. ఉదయం నుంచి వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్), మంగళగిరి రూరల్ అధ్యక్షులు నాలి వెంకట కృష్ణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి కోర్టు వద్ద ఎప్పటికప్పుడు జరుగుతున్న విషయాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. కొమ్మినేని శ్రీనివాసరావుకు గౌరవ న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. ఆయన్ను బయటకు తీసుకు వస్తుండగా దొంతిరెడ్డి వేమారెడ్డి ఇతర నాయకులు శ్రీనివాసరావుతో మాట్లాడేందుకు ప్రయత్నించగా పోలీసులు అనుమతించలేదు. ఆయన్ను అక్కడి నుంచి తరలించిన అనంతరం వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు మనోహర్ రెడ్డి, మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నాల సుధాకర్‌రెడ్డి కలిసి టీడీపీ నాయకుల ప్రోద్బలంతో పెట్టిన అక్రమ కేసులపై చర్చించారు. కొమ్మినేని అరెస్ట్ దుర్మార్గమని.. కక్ష పూరితమని వేమారెడ్డి అన్నారు. కూటమి పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కొమ్మినేనిని అరెస్ట్ చేశారని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి మేకా వెంకటరామిరెడ్డి, దర్శి రమేష్, చిట్టిమళ్ల సుబ్బారావు, మున్నంగి వివేకానందరెడ్డి, టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిలుకోటి శ్రీనివాస మధు, కల్యాణ్, మంగళగిరి పట్టణ యువజన అధ్యక్షులు షేక్ గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిలుస్తోందిపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని కొత్తపేట–1 అంగన్‌వాడీ కేంద్రంలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' అంటూ అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ.. మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని కోరుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హేమలత, విజయలక్ష్మి, సచివాలయం మహిళా పోలీస్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్య పరిష్కరించాలి



కార్మికులతో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యం కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు ఇప్పటి వరకు చెల్లించకపోవడం దారుణమని అన్నారు. కార్మికులు 189 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నా యాజమాన్యంలో స్పందన లేకపోవడం విచారకరమని తెలిపారు. కార్యక్రమంలో సారమ్మ, రమాదేవి, సాంబశివరావు, హగ్గయ్య, ఆశీర్వాదం, సుబ్బారావు, రమణ,గురవయ్య, శివకుమారి, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ సీఐఎస్‌సీఈ జోనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం



విజేతలతో పాఠశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మండల పరిధి నల్లపాడు గ్రామంలోని లయోలా పాఠశాలలో మంగళవారం ఏపీ సీఐఎస్‌సీఈ జోనల్ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ క్రీడల్లో అండర్–14 లెవల్‌లో లయోలా పబ్లిక్ స్కూల్ నల్లపాడు, లిటిల్ ఫ్లవర్‌స్కూల్ గుంటూరు, హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్ కడప నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–17 విభాగంలో లయోలా నల్లపాడు, స్టెమ్ స్కూల్ గుంటూరు పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పోతిరెడ్డి ఆంథోనికి పాఠశాల పీడీ పట్టేటి బాపూజీ క్రీడాకారులను పరిచయం చేశారు. క్రీడాకారులను ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ నగయరాజ్‌మార్క్ మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ నరేష్‌లు జెండాలను ఊపి క్రీడలను ప్రారంభించారు. పోటీలలో అండర్–14 విభాగంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కడప ప్రథమ స్థానంలో నిలిచింది. అండర్–17 విభాగంలో లయోలా పబ్లిక్ స్కూల్ నల్లపాడు విజేతలుగా నిలిచాయి. ద్వితీయ స్థానంలో అండర్–14లో లయోలా పబ్లిక్ స్కూల్ జట్టు, అండర్–17లో లిటిల్ ఫ్లవర్ స్కూల్ నిలిచాయి. తృతీయ స్థానంలో అండర్–14 విభాగంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్, అండర్–17 విభాగంలో స్టెమ్‌స్కూల్‌లు నిలిచాయి. విజేతలను పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందించారు.

దంపతులపై మరిది కుటుంబం దాడి

తెనాలిరూరల్: దంపతులపై మరిది అతని కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు మంగళవారం నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణ సీఎం కాలనీకి చెందిన మొగిలి కృష్ణ, అతని భార్య గంగపై కృష్ణ తమ్ముడు నాగరాజు, అతని కుటుంబ సభ్యులు పోలేరమ్మ, బాబి ఈ నెల 6వ తేదీన దాడి చేసి గాయపర్చారు. ఆస్తి వివాదం నేపథ్యంలో దాడి జరిగినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైభవంగా ఏరువాక పౌర్ణమి

కాజ(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజలో మంగళవారం వైభవంగా ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో వ్యవసాయానికి సిద్ధమయ్యి పొలాల్లోకి కోలాహలంగా వెళ్లారు. వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్), మంగళగిరి రూరల్ అధ్యక్షులు నాలి వెంకట కృష్ణ కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద కాపులు ఆలయంలో వెన్నముద్దలను ప్రసాదంగా గ్రామంలోని ప్రజలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ విభాగ ఉపాధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి, గ్రామ పెద కాపులు సింహాద్రి వెంకట్రామరెడ్డి, కుక్కల కోటేశ్వరరావు, బొమ్ము పిచ్చిరెడ్డి, చెన్నం శ్రీనివాసరావు ,గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు తెనాలిలో డాక్టర్ వెలగా కాంస్య విగ్రహావిష్కరణ



తెనాలి: పట్టణానికి చెందిన గ్రంథాలయోద్యమ ప్రముఖుడు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య కాంస్య విగ్రహాన్ని ఈనెల 12న తెనాలి బండ్‌పై ఆవిష్కరించనున్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు జరిగే విగ్రహావిష్కరణ సభకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షత వహిస్తారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం, లంకా సూర్యనారాయణ, డాక్టర్ బీరం సుందరరావు సభలో పాల్గొంటారు. సంబంధిత ఆహ్వానపత్రికను మంగళవారం సాయంత్రం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆవిష్కరించారు. డాక్టర్ వెలగా వెంకటప్పయ్య కుమారులు హరిసర్వోత్తమరావు, నాగార్జున, వెంకట్రావు, మానవేంద్ర, ఆదర్శ రైతుసంఘం అధ్యక్షుడు ఈదర పూర్ణచంద్, అయినాల మల్లేశ్వరరావు, పావులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా చల్లా ఓబులేసు



తెనాలిఅర్బన్: పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా చల్లా ఓబులేసు నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఆయన గతంలో కొవ్వూరు, తుని, రామచంద్రపురం, గుంతకల్లు, శ్రీకాకుళం కార్పొరేషన్‌లో కమిషనర్‌గా పనిచేశారు. 2005లో తుని మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఎన్నికల్లో 30 నిమిషాల్లో రిజల్ట్‌ను ప్రకటించి రికార్డు సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అతడికి ఆ సమయంలో అవార్డు అందజేసింది. మున్సిపల్ ఇంజనీర్‌గా సెలవులో ఉన్న పి.శ్రీకాంత్ తెనాలి రానున్నారు. మార్కాపురం మున్సిపాలిటీలో డీఈగా పనిచేస్తున్న ఎ.శ్రీనివాసులు బదిలీపై తెనాలి వస్తున్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మాగంటి హరిబాబు

తాడేపల్లి రూరల్: కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళగిరిలో బుధవారం నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలోని కేవీ భవన్‌లో కౌలు, రైతు సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ప్రతి రైతు ఖాతాలో జమ చేస్తామని కూటమి నాయకులు చెప్పారని.. అధికారం చేపట్టి ఏడాది అయినా ఎవరికీ పథకం అమలుకాలేదని విమర్శించారు. మంగళగిరిలోని సీసీఎల్ కార్యాలయం వద్ద కౌలు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిర్వహించే ధర్నాలో రైతులు, కౌలు రైతులు పాల్గొన్నాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



'పకీరు సంగు' నాటకంలో సన్నివేశం

పెదకాకాని: కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని గంగోత్రి వ్యవస్థాపకుడు, నాటక, సినీనటుడు నాయుడు గోపి అన్నారు. మండల కేంద్రమైన పెదకాకాని పేరంటాళ్ల అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో మంగళవారం రాత్రి పకీరు సంగు, శ్రీ సత్యహరిశ్చంద్ర నాటకాలను ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత సంస్కృతి వారి సౌజన్యంతో శ్రీతారకరామ కళాస్రవంతి పెదకాకాని వారి ఆధ్వర్యంలో నాటక ప్రదర్శనల సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు నాయుడు గోపి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి ఒత్తిడి జీవనంలో ప్రతి ఒక్కరిలో ఉత్సాహం, ఉల్లాసం, ఆనందం నింపేందుకు కళా ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ అంతరించిపోతున్న కళలను ఆదరించి కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమానికి కందిపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. అనంతరం ప్రదర్శించిన పకీరు సంగు, శ్రీ సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు కళాకారులను ఉర్రూతలూగించాయి. అనంతరం పలువురు స్థానిక పెద్దలు కళాకారులను సత్కరించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు

ప్రత్తిపాడులో విద్యుత్‌శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు



వివరాలను వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ సీఆర్‌డీఏ సర్కిల్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఈఈలు

ప్రత్తిపాడు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని విద్యుత్ శాఖ సీఆర్‌డీఏ సర్కిల్ ఎస్ఈ పి.సుబ్రమణ్యం అన్నారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని ఈదులపాలెం, గింజుపల్లివారిపాలెం, గనికపూడి, కొత్తమల్లాయపాలెం, కొండేపాడు, మేడావారిపాలెం, నన్నపనేనివారిపాలెం, తిమ్మాపురం, తుమ్మలపాలెం, నిమ్మగడ్డవారిపాలెం , వంగిపురం, యనమదల గ్రామాల్లో మంగళవారం విద్యుత్ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సుబ్రమణ్యం నేతృత్వంలో జరిగిన తనిఖీల్లో 36 మంది అధికారులు, 135 మంది సిబ్బంది, 36 బృందాలుగా ఏర్పడి 2,203 సర్వీసులను తనిఖీ చేశారు. అనంతరం ప్రత్తిపాడు విద్యుత్ సబ్ స్టేషనులో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్ఈ తనిఖీల వివరాలను వెల్లడించారు. మీటరు ఉన్నప్పటికీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 8 మందికి రూ.2.75 లక్షలు.. అనుమతించిన కేటగిరీలో కాకుండా ఇతర కేటగిరీలో విద్యుత్ వాడుకుంటున్న ఒకరికి రూ.5 వేలు.. అనుమతించిన లోడుకంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 82 మందికి రూ.4.22 లక్షలు.. వినియోగం కంటే బిల్లు తక్కువగా వచ్చిన ఒకరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.7.07 లక్షల అపరాధ రుసుములు విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యానికి సంబంధించిన పూర్తి వివరాలను 94408 12263, 94408 12361 నంబర్లకు నేరుగా లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలన్నారు. తనిఖీల్లో ఈఈలు సీహెచ్. వెంకటేశ్వరరావు, వై.ఏడుకొండలు, డీఈఈలు ఎస్.మల్లిఖార్జున ప్రసాద్, ఎ.గురునాథరావు, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, టి.గౌతం, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల్లో పాల్గొనాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్



తెనాలిఅర్బన్: సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 20 నుంచి 25 వరకు ఒంగోలులో జరగనున్న రాష్ట్ర మహాసభల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పేదలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి ఉద్యమానికి సిద్ధపడాలని కోరారు. జిల్లా నాయకులు మేడా హనుమంతరావు, తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ బాబు, కొల్లిపర మండల కార్యదర్శి తుంగా బాలస్వామి, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాశం వెంకటేష్ పాల్గొన్నారు.

ఆరంభించారు.. ఆదమరిచారు!

- తెనాలిలో మళ్లీ మొదటికి వచ్చిన ప్లాస్టిక్ విక్రయాలు
- అన్ని దుకాణాలు, తోపుడు బళ్లపై దర్శనమిస్తున్న ప్లాస్టిక్ కవర్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ప్లాస్టిక్ కవర్‌లో అరటికాయలు వేస్తున్న చిరు వ్యాపారి

తెనాలిఅర్బన్: పట్టణంలో ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలకు అడ్డాగా మారుతోంది. 120 మైక్రాన్‌ల తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు వినియోగించవద్దని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించినా వాటి విక్రయాలు మాత్రం ఆగటం లేదు. గుర్తు వచ్చినప్పుడు మున్సిపల్ అధికారులు హడావిడి చేయడం.. తర్వాత ఆ ఊసే లేకపోవటం పరిపాటిగా మారుతోంది. దీంతో మళ్లీ తెనాలిలో వీటి విక్రయాలు–వినియోగం పెరిగిందని చెప్పవచ్చు. తెనాలి పట్టణంలో సుమారు రెండు లక్షల జనాభా ఉంటారు. వీరు కాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి ఇక్కడికి ప్రతిరోజు సుమారు 10 వేల మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఇక్కడ ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు హోల్ సెల్‌గా విక్రయించే షాపులు సుమారు 8 వరకు ఉంటాయి. వీరు చెన్నై, హైదరాబాద్‌ల నుంచి ఎక్కువగా తక్కువ మందంగా కలిగిన ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు తెప్పించి విక్రయిస్తుంటారు. వీరి నుంచి పట్టణంలో ఉన్న సుమారు అయిదు వేల మంది దుకాణదారులు, చిరు వ్యాపారులు వాటిని కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. వీటిని ప్రజలు ఉపయోగిస్తుంటారు.

సుప్రీం ఆదేశాల అమలేది.. అమలు చేయని అధికారులు

120 మైక్రాన్‌ల తక్కువ మందం ఉన్న వస్తువులు, కవర్ల వినియోగం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని, వాటిని ఎవరు విక్రయించకుండా, ఉపయోగించకుండా చూడాలని ప్రభుత్వాలకు దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. మార్చి నెలలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు పట్టణంలోని అన్ని హోల్ సెల్ షాపులపై దాడులు చేసి వాటి విక్రయాలను ఆపివేయాలని ఆదేశించారు. అలాగే తోపుడుబండ్లు, చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే రూ.అయిదు వేల అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. దీంతో వారు విక్రయాలను కొద్దిరోజులు నిలిపివేశారు. అలాగే మార్చినెలలో ప్లాస్టిక్ వస్తువుల సేకరణను నిర్వహించగా 775 కేజీల ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను ప్రజలు వారికి అందజేశారు. ఆతర్వాత కొద్ది రోజులకే దాని ఊసే మరిచారు. దీంతో తెనాలి పట్టణంలో ఎక్కడ చూసిన తక్కువ మందంగా కలిగిన ప్లాస్టిక్ కవర్ల వినియోగం కన్పిస్తోంది.



ప్లాస్టిక్ కవర్‌లతో వస్తువులను తీసుకు వెళ్తున్న మహిళలు



వాహనాల ముందు వస్తువులతో ఉన్న ప్లాస్టిక్ కవర్లు

ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు ఇవి.

- పర్యావరణంపై దృష్ప్రభావం.. ప్లాస్టిక్ కచ్చితంగా కరుగదు. ఇది వందల సంవత్సరాలు నేలలో ఉంటు భూమిని కలుషితం చేస్తుంది.
- వాతావారణ కలుషితం...ప్లాస్టిక్ తయారీకి పెట్రోలియం ఉత్పత్తులను ఉపయోగిస్తారు. ఇవి గాలి కాలుష్యాన్ని పెంచుతాయి.
- జంతువులకు హాని.. రోడ్లపై, సముద్రంలో ప్లాస్టిక్‌ను పడేయటం వల్ల పశువులు, జలచరాలు దీన్ని తిని మరణించే అవకాశం ఉంది.
- మట్టి నాణ్యత తగ్గింపు.. మట్టిలో కరగకుండా ప్లాస్టిక్ అలా ఉండటం వల్ల దానిలో నాణ్యత తగ్గే అవకాశం ఉంది. పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉంది.
- డ్రైనేజ్ సమస్య...ప్లాస్టిక్ వస్తువులను మురుగు కాల్వల్లో వేయటం వల్ల నీరు కలుషితం అయ్యే అవకాశం ఉంది. అలాగే కాల్వల్లో పారుదల లేకుండా అడ్డుపడతాయి. వరదలకు ఇవి కారణంగా మారతాయి.
- మానవ ఆరోగ్యంపై ప్రభావం..ప్లాస్టిక్ మైక్రో పార్టికల్స్ ఆహారం, నీటి ద్వారా మన శరీరంలోకి వెళ్తే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే క్యాన్సర్ వచ్చేందుకు ఇదికూడా ఒక కారణంగా చెప్పవచ్చు. ఇన్ని దుష్పరిణామాలు ఉన్న నేపథ్యంలో అందరు వీటికి దూరంగా ఉంటే భవిష్యత్ తరాలకు మేలు చేసిన వారం అవుతాము. ఆ దిశగా ప్రభుత్వాలు, అధికారులు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు



ప్లాస్టిక్ రహిత తెనాలిగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. హోల్ సెల్ షాపులపై దాడులు చేసి పెద్ద మొత్తంలో అపరాధ రుసుం విధిస్తున్నాం. ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. వారితో 120 మైక్రాన్‌లలోపు మందం ఉన్న ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలందరు సహకరించాలి.

– వీఎం లక్ష్మీపతిరావు, అసిస్టెంట్ కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

పైచదువులకు ఆర్థిక సహాయం



విద్యార్థినికి చెక్కును అందిస్తున్న శివప్రసాద్

మేడికొండూరు: పేరేచర్లకు చెందిన వల్లెపు నిఖిత లక్ష్మీ పదో తరగతి పరీక్షల్లో 530 మార్కులు సాధించారు. నిఖిత తల్లి సౌరమ్మ కూలి పనులు చేస్తూ బాలికను పదో తరగతి వరకు చదివించారు. పై చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో దాతల కోసం ఎదురు చూశారు. సిరిపురానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ విషయం తెలుసుకుని నిఖిత చదువుపై ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్‌తో చర్చించారు. స్పందించిన సంస్థ రూ.1.20 లక్షల ఆర్థిక సహాయాన్ని శివప్రసాద్ ద్వారా మంగళవారం నిఖితకు చెక్కు రూపంలో అందించారు. దీంతో దాతలకు విద్యార్థిని, తల్లి కృతజ్ఞతలు తెలియజేశారు.

డాక్టర్ జయదేవ్‌కు బంగారు పతకం



తెనాలిరూరల్: విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ జయదేవ్ సుదడానికి తెనాలి వైద్యులు బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు. డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ ధార్మిక బంగారు పతకాన్ని అందుకున్న డాక్టర్ జయదేవ్ 'థైరాయిడ్–వైద్యుల దృక్పథం' అన్న అంశంపై ప్రసంగించారు. ఐఎంఏ తెనాలి అధ్యక్షుడు డాక్టర్ కె. అనిల్‌కుమార్, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, డాక్టర్ మధుప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

•బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

తెనాలిఅర్బన్: వైద్య ఆరోగ్యశాఖలో జరగనున్న సాధారణ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.శ్యామ్ మంగళవారం కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 15న సాధారణ బదీలలకు అనుమతించిదని ఆయన గుర్తు చేశారు.